కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో) ..టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 40, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నూతన కమిటీ ఎన్నిక

అడ్డగుట్ట: సత్యహరిశ్చంద్ర స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తామని శ్మశాన వాటిక అధ్యక్షుడు తాండ్ర రమేష్ అన్నారు. నార్త్‌లాలాగూడలోని సత్యహరిశ్చంద్ర స్మశాన వాటిక పూర్తిస్థాయి నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గత రెండు సంవత్సరాలుగా కొనసాగిన పాత కమిటీని పూర్తి స్థాయిలో రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా తాండ్ర రమేష్, ఉపాధ్యక్షులుగా దొమ్మాటి వెంకటేష్, లక్ష్మి నారాయణ, పరమేష్, సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కార్యదర్శి జగదీష్, శంకర్, బాల్‌రాజ్ ఎన్నికయ్యారన్నారు.

యాదగిరిగుట్ట ఆలయ చైర్మన్‌గా బీసీలను నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: యాదగిరి గుట్ట దేవస్థానం బోర్డు చైర్మన్‌గా బీసీలను నియమించాలని ఆ సంఘం రాష్ట్ర కారదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సర్పంచుల నుంచి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నామినేటెట్ పదవులు, ఇతర అధికారులు కేవలం రెడ్డి వర్గం నుంచి మాత్రమే ఉన్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్లు వేసే యంత్రాలుగా ఉపయోగించుకుంటున్నారని వివరించారు. జనాభాలో అధిక శాతం గల బీసీలకు దేవస్థానం ఛైర్మన్ పదవి అయినా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

యూ టర్న్‌లను కొనసాగించాలి

లాలాపేట: తార్నాక జంక్షన్‌ను యథావిధిగా మూసి వేసి ఇంత కాలం ఉన్న యూ టర్న్‌ల విధానాన్నే కొనసాగించాలనీ తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అధ్యక్షులు చుండి శోభన్‌బాబు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం తార్నాకలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 20 రోజులుగా తార్నాక సిగ్నల్ ఓపెన్ చేయడం వలన నిత్యం వందల సంఖ్యలో వాహనాలు కిలో మీటర్ల మేర రోడ్లపై నిలిచిపోతున్నాయని, ఎండలో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు..సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన ఇంటర్‌సెప్టర్ పోలీసులు గోపాలపురం పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌ని పిలిపించి పరిశీలించగా అతను మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ విజయారెడ్డి పరిశీలించారు. ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌లో రూ. 18 లక్షల వ్యయంతో చేపడుతున్న స్పోర్ట్స్ రూం, టాయిలెట్స్, ప్లే గ్రౌండ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. సీఐబీ క్వార్టర్స్, శ్రీనివాసనగర్‌లలో చేపడుతున్న రూ. 25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను నేరుగా పరిశీలించారు. పనులను అన్ని శాఖల సమన్వయంతో పూర్తిచేయాలని, రోడ్లు వేసిన తరువాత మరలా తవ్వకాలు చేపట్టకుండా సమన్వయంతో పనులు పూర్తిచేయాలన్నారు. కార్పొరేటర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ డీఈ చైతన్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంజగుట్టలో 'ఆపరేషన్ రోప్'



పంజగుట్ట: ఆపరేషన్ రోప్‌లో భాగంగా బుధవారం పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రాంప్రసాద్ రావు నేతృత్వంలోని బృందం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని రోడ్డు ఆక్రమణలను తొలగించారు. రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలకు చలానాలను విధించారు. ఫుత్‌పాట్లు, రహదారులపై ఆక్రమణలు తొలగించారు. ఇకపై వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలిగేలా ఎవరైనా రోడ్డు ఆక్రమణలు చేస్తే సహించేది లేదని రాంప్రసాద్‌రావు పేర్కొన్నారు.

లెక్క తేలింది

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు పరిశీలన పూర్తి..

అమీర్‌పేటలో 1944, సికింద్రాబాద్‌లో 7,350

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి



సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయం



అమీర్‌పేట తహసీల్దార్ కార్యాలయం..

సనత్‌నగర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలనను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. ఈ పథకం ద్వారా లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందించి వారికి ఊతమివ్వాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన ఈ పథకానికి యువత నుంచి అనూహ్య స్పందన లభించింది. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే సికింద్రాబాద్, అమీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయాలకు చేరుకున్న దరఖాస్తులను ఆయా మండలాల తహశీల్దార్లు పాండునాయక్, పద్మసుందరిల పర్యవేక్షణలో స్క్రూట్నీ చేసి ఏయే కార్పొరేషన్‌కు ఎంత మంది అర్హులు ఉన్నారో గుర్తించారు. దరఖాస్తుదారుల్లో గతంలో ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి రుణాలు పొందారా? ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా? వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి అర్హుల ఎంపిక జరిపారు. ఆయా మండలాల నుంచి అర్హుల జాబితాతో జిల్లా కమిటీకి పంపిస్తారు. లబ్ధిదారుడు ఎంచుకున్న యూనిట్లను అనుసరించి రాయితీలు అందనున్నాయి. రూ.50 వేల నుంచి 4 లక్షల వరకు రుణాలను అందిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అర్హుల జాబితాలో ఉన్న వారు తమ ధృవీకరణ పత్రాలను మండల కార్యాలయాల్లో అందజేయాలని ఆయా మండల తహశీల్దార్లు కోరుతున్నారు. చాలామంది దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వదిలేశారని, అలా కాకుండా దరఖాస్తులను సంబంధిత పత్రాలు జతపర్చి ఫిజికల్‌గా అందజేయాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తప్పనిసరిగా తమవెంట తీసుకువచ్చి ఫిజికల్‌గా అందజేయాలని సూచిస్తున్నారు.

ఎంపికైన వారికి రెండు వారాల శిక్షణ

ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వడబోత అనంతరం అమర్‌పేట మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ..ఇలా 26 కార్పొరేషన్ల ద్వారా 1944 మందిని అర్హులుగా గుర్తించారు. అయితే వీరిలో కొంతమంది ఇంకా ధృవీకరణ పత్రాలు అందజేయాల్సి ఉందని, వెంటనే వాటిని అందజేయాలని తహశీల్దార్ పద్మసుందరి సూచించారు. అలాంటి వారికి ఫోన్లు కూడా చేశామన్నారు. ఇక సికింద్రాబాద్ మండలంలో 7,350 ఆయా కార్పొరేషన్ల కింద 7,350 మందిని అర్హులుగా తేల్చారు. అయితే ఇందులో 7,073 మందికి బ్యాంక్ లింక్ చేసి ఉందని, మరో 77 మందికి బ్యాంక్ లింక్ చేసుకోవాల్సి ఉందని సికింద్రాబాద్ తహశీల్దార్ పాండునాయక్ తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్ల వారీగా రెండు వారాల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, కోట నీలిమ తదితరులు

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ నేతృత్వంలో బుధవారం సాయంత్రం బేగంపేటలో జై బాపు, జైభీం, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఎయిర్‌టెల్ ఆఫీసు భవనం నుంచి బేగంపేట ప్యాలెస్ వరకు జరిగిన ఈ ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. అంబేద్కర్, గాంధీజీ, రాజ్యాంగ ప్రతిని చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను నెరవేర్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. రాజ్యాంగాన్ని కుట్ర జరుగుతుందని, దీనిని కలసికట్టుగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ మాజీ సర్పంచ్ సిద్దేశ్వర్, సీనియర్ నాయకులు విశాల్ సూదం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



వాసవిమాత జయంతి కార్యక్రమంలో పాల్గొన్న తలసాని తదితరులు

రాంగోపాల్‌పేట్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవిమాత అని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు వాసవిమాత జయంతి సందర్భంగా బుధవారం రాంగపాల్‌పేట డివిజన్ లోని ఆవుల మంద వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్‌గౌడ్, అత్తిలి అరుణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ పాల్గొన్నారు.

'ఆపరేషన్ అభ్యాస్'పై అవగాహన

సనత్‌నగర్: భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో భాగంగా బేగంపేట పోలీసులు సాధారణ పౌరులకు అవగాహన కల్పించారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రసూల్‌పురా చౌరస్తాలో కొద్దిసేపు ట్రాఫిక్‌ను నిలిపి సైరన్ మోగించి అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహన కలిగించారు. ఒకవేళ యుద్ధ వాతావరణం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను, తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరించారు.



రసూల్‌పురా చౌరస్తాలో ట్రాఫిక్ నిలిపివేసి సైరన్ మోగించి అవగాహన కల్పిస్తున్న బేగంపేట పోలీసులు

పాకిస్థాన్, బంగ్లాదేశీయులను బహిష్కరించాలని వినతి

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీ, బాంగ్లాదేశీయులను బహిష్కరించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ కోరారు. బుధవారం మహంకాళి, సికింద్రాబాద్ జిల్లాకు చెందిన పలువురు బిజేపీ నేతలతో వెళ్లి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయుల అనుమానిత ఉనికిపై దృష్టిని సారించాలని కోరుతున్నామన్నారు. గత నెల 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి చర్య పట్ల దేశ ప్రజలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే సంస్థలు, దేశాలపై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సంకల్పించారన్నారు.

బోనాల జాతరకు టెండర్ల కేటాయింపు

రాంగోపాల్‌పేట్: రానున్న ఆషాడ బోనాల పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయానికి సంబంధించి వివిధ టెండర్ల కేటాయింపు బుధవారం నిర్వహించినట్లు ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆషాడ బోనాల జాతరకు సంబంధించి విద్యుత్ దీపాలంకరణ, పూల డెకరేషన్, కలకత్తా డెకరేషన్, వీడియో, ఫొటోగ్రఫీ, ఆలయానికి రంగులకు సంబంధించి టెండర్లను పలువురికి కేటాయించినట్లు వివరించారు. విద్యుత్ దీపాలంకరణకు రూ. 9.70 లక్షలు, పూల డెకరేషన్‌కు రూ. 14.78 లక్షలు, ఆలయానికి రంగులకు రూ. 15 లక్షలకు కేటాయించామన్నారు. అదే విధంగా 2034–24 సంవత్సరంలో సేకరించిన సుమారు 20 వేల చీరలు, బ్లౌజ్ పీసులు కూడా విక్రయించనున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: హైదర్‌గూడలో నారాయణగూడ జలమండలి అధికారులు చేపట్టిన నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని... అక్రమాలు చోటుచేసుకున్నాయని కార్పొరేటర్ మహాలక్ష్మి ఆరోపించారు. నెల క్రితం జలమండలికి సంబంధించిన కాంట్రాక్టర్ రెయిన్ వాటర్ పైప్‌లైన్‌ల వ్యవస్థను ధ్వంసం చేసి నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. రెయిన్ వాటర్ పైప్‌లైన్‌లోకి డ్రైనేజీ నీరు వెళ్లేలా పనులు చేసి వెళ్లారు. ఈ క్రమంలో వర్షపు నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేస్తుండగా బుధవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ ప్రవీణ్, ఏఈ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము పర్యవేక్షించడంతో రెయిన్ వాటర్ పైప్‌లోంచి మురుగునీరు రావడాన్ని గుర్తించి మ్యాన్ హోల్స్ తెరిచి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి ఘటన స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. జలమండలి మేనేజర్ ఉమామహేశ్వరరావుకు ఫోన్ చేసి విషయం ఆరా తీయగా ఆయన వచ్చి ఇలాంటి పునరావృత్తం కాకుండా చూస్తామని, కాంట్రాక్టర్ వివరణ తీసుకుని అసంపూర్తిగా ఉన్న పనులు చేయిస్తామని చెప్పారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లడుతూ... అధికారుల సమన్వయ లోపంతో పాటు జలమండలి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనుల్లో లోపాలు జరిగినట్లు గుర్తించామన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి

లాలాపేట: కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్ర స్వామి 166వ ఆరాధన గురుపూజా మహోత్సవాలు బుధవారం లాలాపేటలో ఘనంగా నిర్వహించారు. వంశపారంపర్య పండితులు సదానందాచార్యుల సారధ్యంలో మహాపడి హారతి పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపించారు. ఉత్సవాల్లో బీజేపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

ఇండియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదం

దగ్ధమైన కంప్యూటర్లు, ఫైల్స్, ఏసీలు, ఫర్నిచర్

హిమాయత్‌నగర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇండియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదం సంభవించింది. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సమాచారం మేరకు... నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్ సమీపంలో ఉన్న ఇండియన్ బ్యాంకులో విద్యుత్ వైర్ల నుంచి ఆకస్మాతుగా మంటలు వచ్చి దట్టమైన పొగలు నిండిపోయి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు డయల్ 100 సమాచారం ఇవ్వడంతో నారాయణగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని పిలిపించారు. ఒక ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో విలువైన కంప్యూటర్లు, ఫైల్స్, ఏసీలు, ఫర్నిచర్ తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్





రసూల్‌పురా: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ డైరక్టరేట్ ఆధ్వర్యంలో సివిల్ అడ్మినిస్ట్రేషన్, ఫైర్ సర్వీసెస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్‌డ్రిల్ ద్వారా ఎన్‌సీసీ క్యాడెట్లు సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించడంలో సామర్థ్యాలను ప్రదర్శించారు. కల్నల్ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి జయంతి

రహమత్‌నగర్: వైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని బుధవారం సంతోషగిరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం యజ్ఞం, అన్నప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలనరు నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చిటుమల్లి శ్రీనివాస్‌గుప్తా(నిజామాబాద్ శ్రీను), ప్రధాన కార్యదర్శి డి.మధుసూదన్‌గుప్తా, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి రాజేష్‌కుమార్‌గుప్తా, సుముద్రాల మల్లేశ్ గుప్తా, బుద్ద నాగరాజుగుప్తా, కొవురి ప్రభు గుప్త, బ్రహ్మానందంగుప్తా, ఆలయ ధర్మకర్త పాక కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్న వ్యర్థాలు



వెంకటేశ్వరకాలనీ: పాదచారులు నడిచేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లు చెత్తకుప్పలు, మట్టి వ్యర్థాలతో నిండిపోయి కనిపిస్తున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని ఆశా ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై గత కొద్ది నెలలుగా వ్యర్థాలు ఫుట్‌పాత్‌పై కుప్పలుగా ఉన్నాయి. వీటిని తొలగించాల్సిన శానిటేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొంటున్నది. ఇకనైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే..!

- దరఖాస్తులు 4795
- ఆమోదించినవి 1401
- ఫీజు చెల్లించివి 145
- తలకిందులైన ఆదాయం అంచనాలు
- జీహెచ్‌ఎంసీ ఉత్తరమండలంలో పరిస్థితి



జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం కార్యాలయం



జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్.(ఫైల్)

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని నాలుగు సర్కిళ్ల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు దారుల నుంచి స్పందన కరువైంది. అందిన దరఖాస్తుల పరిశీలనలో అధికారులు నిర్లక్ష్యం వహించగా, ఆమోదం పొంది ఫీజు చెల్లించాలంటూ దరఖాస్తు దారులకు జీహెచ్‌ఎంసీ అధికారులు సందేశాలు పంపినప్పటికీ నామమాత్రపు స్పందన మాత్రమే లభించింది.

- ఐదు సర్కిళ్ల పరిధిలో 4795 దరఖాస్తులు ఉండగా అందులో ఫీజు చెల్లించేందుకు 1401 దరఖాస్తులు ఆమోదం పొందినట్టు అధికారులు ప్రకటించారు. ఇందులో కేవలం 145 మంది మాత్రమే ఫీజు చెల్లించడం గమనార్హం. దరఖాస్తులు చేసుకున్న కొద్ది సంవత్సరాల తరువాత ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మోక్షం లభించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జీహెచ్‌ఎంసీ అధికారులు (ఏప్రిల్ మాసంలో) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ప్రత్యేక చర్యలు వృధా....

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు పలు పరిశీలనలు చేసిన అనంతరం ఆమోదం లభించిన దరఖాస్తు దారులు ఈనెల 3 లోపు ఫీజు చెల్లించుకునేందుకు మున్సిపల్ అధికారులు అవకాశం ఇచ్చారు. నిర్ణీత గడువు లోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇస్తున్నట్టు కూడా ప్రకటించారు.

- ఫీజు చెల్లింపులో దరఖాస్తు దారుల సందేహాలు నివృత్తి చేయడం, సమస్యలు పరిష్కరించడం కోసం ఐదు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కలు ఏర్పాటు చేశారు. ఎక్కువ మొత్తంలో ఆదాయం (ఫీజు) వ్యక్తిగతంగా దరఖాస్తు దారులకు ఫోన్ ద్వారా, సందేశాల ద్వారా సమాచారం అందించారు. అయినప్పటికీ దరఖాస్తు దారుల నుంచి పెద్దగా స్పందన కానరాలేదు.

పరిశీలనల్లో జాప్యం

తమకు అందిన దరఖాస్తులు అమోదించడంలో జోనల్ సిటీప్లానింగ్ విభాగం అధికారులు తీవ్రంగా జాప్యం చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. పడరాని పాట్లు పడి వివిధ విభాగాల అధికారుల నుంచి ధ్రువపత్రాలు తెచ్చుకుని దరఖాస్తు చేసుకున్నప్పటికీ మళ్లీ లోపాలు ఉన్నట్టు అధికారులు సాకులు చూపుతుండడంతో దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణ కోసం అంతగా ఆసక్తి కనబరుచడం లేదు. ఆమోదించిన దరఖాస్తులకు సైతం రూ.లక్షల్లో ఫీజు చెల్లించాలంటూ అధికారులు చెబుతుండడంతో దరఖాస్తులు ఆమోదం పొందిన వారు కూడా ఫీజు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు.

కేవలం రూ.2.5 కోట్ల ఆదాయం..

జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలో మొత్తంగా 1401 దరఖాస్తులను ఆమోదించిన అధికారులు కనీసం వెయ్యి దరఖాస్తుల నుంచి ఫీజు రాబట్టవచ్చునని అంచనా వేశారు. వారందరికీ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఆన్‌లైన్‌ద్వారా చెల్లించాలంటూ ఫోన్ కాల్ ద్వారా, మెస్సేజ్ ద్వారా సమాచారం అందించారు. అయినప్పటికీ కేవలం 145 మంది దరఖాస్తు దారుల ద్వారా రూ. 2,51,64,675 ఆయాదం అలభించింది.

- జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని 38 మంది దరఖాస్తుల్లో కేవలం ఒక్కరు మాత్రమే క్రమబద్దీకరణ ఫీజును చెల్లించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో 1095 మంది ఆమోదిత దరఖాస్తులు ఉండగా 131 మంది ఫీజు చెల్లించారు. సరైన ధృవీకరణలు దరఖాస్తుతో జత పరుచకపోవడం, భూసమస్యలు, వివాదాలు వంటి కారణాలు చెబుతున్న అధికారులు 3.394 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం గమనార్హం.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల తీరు

సర్కిల్ పేరు	దరఖాస్తులు	ఆమోదించినవి	ఫీజు చెల్లించినవి
సికింద్రాబాద్	531	107	06
అంబర్‌పేట్	339	103	05
ముషీరాబాద్	165	38	01
బేగంపేట్	365	58	02
మల్కాజిగిరి	3395	1095	131
మొత్తం	4795	1401	145

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు చేయూత

శ్రీనగర్‌కాలనీ: పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లాల్‌బహదూర్‌శాస్త్రి సేవానికేతన్ లైబ్రరీ కమిటీ ఆర్థిక సాయం చేయనుందని కమిటీ ప్రతినిధులు పి.నరసింహులు, ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. ఆధార్ కార్డు, చిరునామా, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఎస్‌ఎస్‌సీ మార్కుల మెమో తీసుకొని గ్రంథాలయంలో లేదా ఫోన్స్: 92958 03116, 99497 77417లలో సంప్రదించాలని సూచించారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రెండు సంవత్సరాల కాలానికి కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కె.ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎం.డి.మియాజాని, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీగా అశోక్, కోశాధికారిగా పాండులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రిటర్నింగ్ ఆఫీసర్ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డిలకు పరిచయం చేశారు.